షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక


వంటవారు కావలెను
ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో
నూతనంగా ఏర్పాటు చేయనున్న టిఫెన్ మరియు మినిమీల్స్
హోటల్ నందు పని చేసేందుకు అనుభవం కలిగిన వంట వారు కావలెను.
కుటుంబంతో వచ్చి పని చేయవలెను. వసతి, భోజనం ఉచితం.
Contact : 9966665060

సంపుటి : 1 సంచిక : 285 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 30 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 270 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 14 August 2024 PAGES : 8 PRICE : 5/-



## దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు

- తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాజకీయ ప్రముఖుల శుభాకాంక్షలు..
- తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించే బృహత్ బాధ్యతను మనం తీసుకుందాం
- ఏపీ సీఎం చంద్రబాబు
- నవ తరానికి తెలుగు గొప్పదనాన్ని తెలియచేద్దాం: పవన్

అమరావతి:

తెలుగు భాషా దినోత్సవం రాజకీయ ప్రముఖులంతా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు - మిగతా3లో

# వైసీపీకి షాక్!

- రాజ్యసభ పదవికి, వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీలు..
- ఏక కాలంలో ఎంపీ పదవికి, వైసీపీ పార్టీకి రాజీనామా
- మరో ఎంపీ బీద మస్తాన్ రావుతో కలిసి రాజ్యసభ చైర్మన్ కు లేఖ అందజేత
- టీడీపీలో చేరబోతున్నట్లు వెల్లడించిన మోపిదేవి
- చంద్రబాబు మా బాస్: బీద మస్తాన్ రావు
- వీరి బాటలోనే మరికొందరు నేతలు ఉన్నారని సమాచారం
- వారిలో అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి



ఢిల్లీ

రాజ్యసభ పదవికి, వైసీపీకి మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్ రావులు రాజీనామా చేశారు. పార్లమెంట్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా పత్రాలను ఇరువురూ అందజేశారు. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వైసీపీకి సైతం రాజీనామా చేశారు. ఇద్దరు ఎంపీల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మోపిదేవి కుడి భుజంలా వ్యవహస్తే.. బీద మస్తాన్ రావుపార్టీలో కీలక వ్యవహరించారు. ఇప్పుడు వీరిద్దరూ పార్టీకి రాజీనామా చేయడంతో కేడర్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. నేతలే తమ దారి తాము చూసుకుంటుంటే తమ పరిస్థితేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఇద్దరూ అటు పదవికి, ఇటు పార్టీకి ఏకకాలంలో రాజీనామా చేశారు. ఈమోపిదేవి, బీద మస్తాన్ రావులు నిన్న రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. నేటి మధ్యాహ్నం 12:30 గంటలకు రాజీనామా లేఖను రాజ్యసభ చైర్మన్‌కు అందజేశారు. రాజీనామాను - మిగతా3లో



## ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్!

- అక్కడ 610 మందిని బలిగొన్న వైరస్..
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎంపాక్స్ ముప్పు నేపథ్యంలో భారత్ అప్రమత్తం
- ఎంపాక్స్ కేసులను గుర్తించేందుకు, సరైన చికిత్స అందించేందుకు ఆరోగ్య నిపుణులకు కేంద్రం శిక్షణ

## కోల్‌కతా ఘటనతో పాటు ఇతర ఘటనలపైనా స్పందించాలి



- మహిళల భద్రతకు సంబంధించి ఈ ఘటనపై మనమందరం పెదవివిప్పడం కీలకం
- రాష్ట్రపతి కేవలం ఘటనపై మాట్లాడటమే కాకుండా ఇతర ఘటనలపై కూడా స్పందించాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరిన కాంగ్రెస్

## లక్ష కోట్లు పెట్టుబడి పెట్టేందుకు గతంలోనే అదానీని ఒప్పించాం

చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్ అన్న లోకేశ్

ఏపీకి మళ్లీ పెట్టుబడిదారులు వస్తున్నారని వ్యాఖ్య

వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా భూములను ఆక్రమించారని విమర్శ



విజయవాడ

ఏపీలో ప్రజా పాలన వచ్చిందని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్ అని... ఆయన సీఎం అయిన తర్వాత రాష్ట్రానికి మళ్లీ పెట్టుబడిదారులు వస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో రూ. లక్ష కోట్లు పెట్టుబడి పెట్టేందుకు గతంలోనే అదానీని ఒప్పించామని... అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని అన్నారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ పాలనలో - మిగతా3లో

# ఏపీలో ఈవీఎం పాలిటిక్స్

- ఫలితాలపై అనుమానాలున్నాయంటూ వైసీపీ నేతలు ఏపీ ఎన్నికల ప్రధాన అధికారిని కలిశారు.
- ఈసీ ప్రకటించిన పోలింగ్ శాతానికి.. కౌంటింగ్‌లో చూపిన పోలింగ్ పర్సంటేజీకి మధ్య తేడా వుండడం అనుమానాలు
- ఎన్నికలు జరిగిన రోజు ఈసీ ఫైనల్‌గా 80.66 శాతం పోలింగ్
- జూన్4న కౌంటింగ్‌లో మాత్రం పోలింగ్ పర్సెంటేజీని 82శాతంగా చూపారు



విజయవాడ

2024 ఎన్నికల ఫలితాలపై అనుమానాలున్నాయంటూ వైసీపీ నేతలు ఏపీ ఎన్నికల ప్రధాన అధికారిని కలిశారు. ఈసీ ప్రకటించిన పోలింగ్ శాతానికి.. కౌంటింగ్‌లో చూపిన పోలింగ్ పర్సంటేజీకి మధ్య తేడా వుండడం అనుమానాలకు తావిస్తుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు.. ఎన్నికలు జరిగిన రోజు ఈసీ ఫైనల్‌గా 80.66 శాతం పోలింగ్ నమోదయినట్టు ప్రకటించిందన్నారు. జూన్4న కౌంటింగ్‌లో మాత్రం పోలింగ్ పర్సెంటేజీని 82శాతంగా చూపారన్నారు అంబటి. ఈ తేడా ఎందుకొచ్చింది? ఇన్ని రోజులైనా పార్టీల వారీగా ఓట్లను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారాయన. ఇక ఈవీఎం బ్యాటరీ చార్జింగ్ 99 శాతం ఉండడం ఏంటన్నారు. భద్ర పరిచాక బ్యాటరీ ఛార్జింగ్ ఎలా పెరుగుతుందన్నారు. వీవీ ప్యాడ్‌లను లెక్కించమమే మాక్ పోలింగ్ - మిగతా3లో



## ఛత్తీస్ గఢ్‌లో ఎన్ కౌంటర్

- ముగ్గురు మహిళా నక్సలైట్లు హతం
- ఉదయం నుంచి మావోలు, భద్రతా బలగాల మధ్య కాల్పులు
- ఇంకా కొనసాగుతున్న ఎన్ కౌంటర్

# ఐపీఎస్‌ల ధిక్కార స్వరం

- అప్పట్లో విపక్షాలను టార్గెట్ చేసిన తీరు అభ్యంతరకరంగా ఉండేది.
- సాధారణంగా ప్రభుత్వానికి అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తారు.
- కానీ గత ఐదేళ్లుగా కొందరు అధికారులు అతిగా ప్రవర్తించారు.

గుంటూరు

వైసిపి హయాంలో కొందరు సీనియర్ ఐపీఎస్ అధికారుల వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. అప్పట్లో విపక్షాలను టార్గెట్ చేసిన తీరు అభ్యంతరకరంగా ఉండేది. సాధారణంగా ప్రభుత్వానికి అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తారు. కానీ గత ఐదేళ్లుగా కొందరు అధికారులు అతిగా ప్రవర్తించారు. ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అటువంటి వివాదాస్పద ఐపిఎస్ అధికారులకు చంద్రబాబు సర్కార్ పోస్టింగులు ఇవ్వకుండా వెయిటింగ్ లో ఉంచింది. వీరు సాధారణంగా డీజీపీ కార్యాలయంలో ఎటువంటి విధులు లేకుండా ఉంటారు. వస్తే - మిగతా3లో



# వైసీపీకి షాక్!

-మొదటిపేజీ తరువాయి

సమర్పించడానికి ముందు మోపిదేవి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైసీపీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు.ఏ సందర్భంలో వైసీపీకి రాజీనామా చేస్తున్నాను ఏమిటనేది వైసీపీ నేతలే ఆలోచించాలన్నారు. తాను తీసుకున్న నిర్ణయం సరైనదో కాదో వైసీపీ వాళ్లే చెబుతారని అన్నారు. చిల్లరగా మాట్లాడే మనస్తత్వం తనది కాదని.. రాజ్యసభ పదవిపై తాను మొదటి నుంచి ఇంట్రెస్ట్ గా లేనన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో చేరుతానని మోపిదేవి వెంకట రమణ ప్రకటించారు. రాజకీయ వ్యవస్థను.. రాష్ట్ర పరిపాలన గాడిలో పెట్టాలని చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు కూడా తనతో చర్చించారని మోపిదేవి వెల్లడించారు.

రాజీనామా చేసిన తర్వాత నియోజకవర్గం వెళ్లి కార్యకర్తలతో సమావేశం అవుతానని మోపిదేవి వెంకటరమణ తెలిపారు. రాజీనామా చేసిన తర్వాత తాను ఖాళీగా ఉండాలని అనుకోవడం లేదన్నారు. వైసీపీ అధినేత జగన్ తన వైఖరి మార్చుకోవాలన్నారు. పార్టీ మారుతున్న తనపై వైసీపీ నేతలు



చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. గతంలో తనకు ఎలాంటి ఇబ్బందులు కలగజేసారో అందరికీ తెలుసని మోపిదేవి తెలిపారు. మొత్తానికి మోపిదేవి, బీద మస్తాన్ రావులు ముందుగా చెప్పినట్టుగానే రాజీనామా చేశారు. అయితే వీరి బాటలోనే మరికొందరు నేతలు ఉన్నారని సమాచారం. వారిలో అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా వైసీపీని వీడి టీడీపీ, బీజేపీ, జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని టాక్.

గెలుపైనా ఓటమైనా స్థానిక రాజకీయాల్లో ఉండడమే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. రాజ్యసభకు రావడం తనకు ఇష్టంలేదన్నారు. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. టీడీపీలో తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారనేది త్వరలోనే తెలుస్తుందని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదని ఈ సందర్భంగా మోపిదేవి స్పష్టం చేశారు.

**చంద్రబాబు మా బాస్: బీద మస్తాన్ రావు**

రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం బీద మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ.. తన సోదరుడు బీద రవిచంద్ర కూడా టీడీపీలోనే ఉన్నాడన్నారు. మోపిదేవి వెంకటరమణ కిందిస్థాయి నుంచి వచ్చారన్నారు. చైర్మన్ ఫార్మాట్లోనే రాజీనామా చేశానన్నారు. రాబోయే రాజకీయ భవిష్యత్తుపై కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. చంద్రబాబు నాయుడు కలిశారని బీద మస్తాన్ రావును అడగ్గా... గతంలో చంద్రబాబు నాయుడు మా బాస్ అని సమాధానమిచ్చారు. వ్యక్తిగత కారణాల వల్ల స్వచ్ఛందంగా రాజీనామా చేశానని బీద మస్తాన్ రావు తెలిపారు.

# దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు

-మొదటిపేజీ తరువాయి

భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయులను నేడు తలచుకోవడం ద్వారా అమ్మ భాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు చెబుదామని ట్విటర్ వేదికగా చంద్రబాబు తెలిపారు. వారి అడుగు జాడల్లో నడుస్తూ మన భాషను సుసంపన్నం చేసుకుందామన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించే బృహత్ బాధ్యతను మనం తీసుకుందామన్నారు. అదే వారికి మనమిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. తెలుగు వెలగాలని.. తెలుగు భాష వర్ధిల్లాలని కోరుకుంటూ దాని కోసం పని చేద్దామని చంద్రబాబు అన్నారు.

**నవ తరానికి తెలుగు గొప్పదనాన్ని తెలియచేద్దాం: పవన్**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం తెలుగు భాషా దినోత్సవంపై స్పందించారు. తెలుగు భాష తీయదనాన్ని భావి తరాలకు అందిద్దామన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన అమ్మ భాషను గౌరవించుకొందామన్నారు. నవ తరానికి తెలుగు గొప్పదనాన్ని తెలియచేద్దామన్నారు. గ్రాంథికంలో ఉన్న తెలుగును వాడుక భాషకు తీసుకువచ్చి రచనలు చేయడం వల్లే భాషా సౌందర్యం ఇనుమడించిందని పవన్ అన్నారు. ఇందుకు వ్యావహారిక భాషోద్యమ మూల పురుషుడు గిడుగు



వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకొంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తికి అంజలి ఘటిస్తున్నానని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి మన విద్యార్థులకు తెలుగు భాష నేర్పించడం ద్వారా మాతృ భాష విలువ తెలియడమే కాదు... వారి ఆలోచన పరిధి విస్తృతమవుతుందన్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లోనూ తెలుగు భాష వినియోగం పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నిత్య వ్యవహారంలోనూ మన భాషకు పట్టం కట్టినప్పుడే తెలుగు భాషా దినోత్సవానికి సార్థకత చేకూరుతుందని పవన్ అన్నారు.

**మా అబ్బాయికి తెలుగులో చదవటం, రాయటం నేర్పిస్తున్నా: నారా లోకేష్**

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వాడుక భాషలో రచనలు ఉండాలని జీవితాంతం ఉద్యమించిన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం, ఆ మహనీయుని కృషిని సమర్థించుకునే అవకాశం తెలుగువారిగా మనకు దక్కిందన్నారు. అమ్మ జన్మనిస్తే, మాతృభాష తెలుగు మన జీవితాలకు వెలుగునిస్తోందన్నారు. ఇంగ్లీషు మీడియం, విదేశాల్లో చదువు వల్ల తాను మొదట్లో తెలుగులో మాట్లాడేటప్పుడు పదాలు అటు ఇటు అయితే.. ఎంతో బాధపడేవాడినని నారా లోకేష్ తెలిపారు. అచ్చమైన తెలుగులో నిత్యం జనంతో మాట్లాడుతూ ఉంటే మాతృభాష మాధుర్యం ఎంత గొప్పదో తెలుస్తోందన్నారు. తన కుమారుడు దేవాన్ష్‌కి ప్రత్యేకంగా తెలుగు మాట్లాడటమే కాదు.. చదవటం, రాయటం కూడా నేర్పిస్తున్నానని లోకేష్ తెలిపారు. తెలుగువారిగా గర్వపడదాం.. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేద్దామన్నారు. తెలుగు భాషని సుసంపన్నం చేస్తున్న తెలుగు ప్రజలందరికీ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నానని నారా లోకేష్ తెలిపారు.

# ఈవో లేకుండనే బ్రహ్మోత్సవాలు

**తిరుపతి :** దేవతల్లో ప్రథమ పూజితుడు గణనాథుడు. ఊరిలోనో కాలనీలోనో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేసినా కాణిపాకం బ్రహ్మోత్సవాలు చాలా ప్రత్యేకం. అందుకే లక్షల మంది భక్తులు వినాయక బ్రహ్మోత్సవాలకు తరలి వస్తుంటారు. స్వయంభూగా వెలసింది చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకంలో స్వామి వారికి జరిగే వేడుక తిలకించి పరవశించిపోవాలని కోరుకుంటారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఏడాది వినాయక చవితి రోజు అంటే సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 27వ తేదీన ముగుస్తాయి. ఈసారి కూడా ప్రసిద్ధి చెందిన ఈ బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు, స్వామి దర్శనం కోసం లక్షల మంది భక్తులు తరలివస్తారు. ప్రతిష్టాత్మకమైన కాణిపాకం బ్రహ్మోత్సవ ఏర్పాట్లు మాత్రం చురుగ్గా సాగడం లేదన్న విమర్శ గట్టిగా వినిపిస్తోంది. 9 రోజుల్లో వేడుకలు మొదలు కానున్నా ఇంకా నత్త నడకన పనులు సాగుతున్నాయి. దీనిపై జిల్లా అధికారులు సమీక్ష చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళి మోహన్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రణాళికలు, చేయాల్సిన పనులపై చర్చించారు. వేడుకలు జరిగే 21 రోజుల పాటు రెవెన్యూ, పోలీసులు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఏపీఎస్ఆర్టీసీ, పారిశుధ్య, అగ్నిమాపక శాఖ చేయాల్సిన పనుల గురించి సమీక్షించారు. ఐదు రోజుల్లో కీలకమైన పనులు పూర్తి కావాలని ఆదేశించారు. కాణిపాకం ఆలయంలో మొన్నటి వరకు వెంకటేశు అనే ఈవో పని చేశారు. ఆయన హయాంలో ఉభయదారుల నుంచి భక్తుల వరకు ఏదో ఒక సమస్య వచ్చేది. ఈవో ఇష్టానుసారంగా వ్యవహరించారని ఫిర్యాదులు వచ్చేవి. కూటమి నాయకులను కూడా ఆయన విమర్శించారు. దీంతో కొత్త ప్రభుత్వం ఆయనను బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇన్చార్జి ఈవోగా వాణిని నియమించారు. పాలకమండలి నియామకం కూడా చేపట్టలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బ్రహ్మోత్సవాలు ఎలా జరుగుతాయనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది. 21 రోజుల పాటు జరిగే



బ్రహ్మోత్సవాలంటే అషామాషీ కాదు. అర్చకులు విధులు, ఉద్యోగులు, అదనపు సిబ్బందికి పని పురమాయించడంతోపాటు నిధుల మంజూరు కూడా చేయాల్సి ఉంటుంది. ఈవో లేకపోతే ఇవి పూర్తి స్థాయిలో జరగవవి ఉభయదారులు, భక్తులు అంటున్న మాట. ఇన్చార్జి ఈవోకు పూర్తి స్థాయి పవర్ ఉండదని అంటున్నారు. బ్రహ్మోత్సవాల్లాంటి కీలకమైన వేడుకలు ఉన్న టైంలో ఈవో నియామక ప్రక్రియ పూర్తి చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. 21 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు మరో 9 రోజల గడువు ఉంది. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం వేగం పుంజుకోవడం లేదు. అవి సకాలంలో ఎంత వరకు పూర్తి అవుతాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సరిగ్గా చేయకపోతే కూటమి ప్రభుత్వం పై విమర్శలు వచ్చే ప్రమాదం ఉందని ఆ పార్టీల నేతలే చెబుతున్న మాట. ఆ వినాయక స్వామి తన వేడుకలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని భక్తులు కోరుకుంటున్నారు.



## లక్ష కోట్లు పెట్టుబడి పెట్టేందుకు గతంలోనే అదానీని ఒప్పించాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా భూములను ఆక్రమించారని... ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో త్వరలోనే వివరాలతో సహా చెపుతామని లోకేశ్ అన్నారు. విశాఖలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని... భూములు లాక్కున్నారని, కిడ్నాప్ లు చేశారని మండిపడ్డారు. దసపల్లా భూములను లాక్కున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలకు కట్టుబడి ఉన్నామని... అయితే, అన్నింటినీ నెరవేర్చడానికి ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని అన్నారు.

## ఏపీలో ఈవీఎం పాలిటిక్స్

-మొదటిపేజీ తరువాయి

అంటున్నారు. ఈవీఎంల తనిఖీ కోసం వెళ్తే అధికారులు తమ దగ్గర తాళం చెవి లేదని చేతులెత్తేశారని.. ఇలా ప్రతీ అంశం అనుమానాస్పదంగా వుందన్నారు. తమకు ఉన్న సందేహాలు ఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీదేనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.కాగా.. ఈవీఎంలపై వైసీపీ ఈసీని ఆశ్రయించడాన్ని కూటమి నేతలు తప్పు పట్టారు. ప్రజాతీర్పును వైసీపీ గౌరవించాలన్నారు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ. ఫలితాలు ప్రకటించిన రెండు నెలల తరువాత అనుమానాలేంటన్నారాయన. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశం లేదన్నారు మంత్రి సత్యకుమార్. ఓటమికి కారణాలను విశ్లేషించుకోవాల్సింది పోయి ఈవీఎంలపై అనుమానాలంటూ వైసీపీ ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు . 2019లో ఈవీఎంలపై వైసీపీకీ ఔట్లు రాలేదా? అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు.ఈవీఎంలపై తలెత్తుతోన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీదని వైసీపీ అంటోంది.ఇదంతా ప్రజల దృష్టి మర్చలాడినికి వైసీపీ వేసిన ఎత్తుగడ అంటున్నారు కూటమి నేతలు. అలా ఈవీఎంల కేంద్రంగా ఏపీ పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి

# ఐపీఎస్‌ల ధిక్కార స్వరం

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయానికి వస్తారు.. లేకపోయినా అభ్యంతరం ఉండేది కాదు. అయితే ఇలా వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ అధికారులు బెంగళూరు వెళ్లి జగన్ ను కలిశారు. ఇది కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి కారణమైంది. అందుకే రెగ్యులర్ గా డిజిపి కార్యాలయానికి వెళ్లి వెయిటింగ్ లో ఉన్న అధికారులు హాజరు నమోదు వేయాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. తెలంగాణకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఒకరు బాహటంగానే వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎంతోమంది ఐపీఎస్ అధికారులను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని.. కొంతమంది అధికారులు రాజకీయ నేతలుగా మారారని.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని టిడిపి నేతలు ప్రశ్నించడంతో.. వివాదాస్పద అంశంగా మారింది. అయితే డిజిపి కార్యాలయానికి వెళ్లి హాజరు నమోదు చేసే ప్రక్రియను కొందరు అధికారులు విస్మరిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా పట్టించుకోవడం లేదని సమాచారం. దీనిపై తదుపరి యాక్షన్ కు ప్రభుత్వం దిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున బదిలీ ప్రక్రియ చేపట్టింది. 16 మంది అధికారులకు పోస్టింగులు దక్కలేదు. గతంలో మాదిరిగా వదిలేద్దామని కూటమి ప్రభుత్వం భావించింది. అయితే మధ్యలో జగన్ ను కలిశారన్న వార్తల నేపథ్యంలో రోజు డిజిపి కార్యాలయానికి వచ్చి.. హాజరు నమోదు చేసి.. సాయంత్రం వరకు ఉండాలని ఆదేశాలు ఇచ్చింది.అయితే ఇప్పటికే తెగింపునకు వచ్చిన సదరు వైసిపి అస్మదీయ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. డిజిపి ఆదేశాలను కూడా వీరు లెక్కచేయని పరిస్థితి ఉండడంతో.. వీరి విషయంలో ఏం చేయాలో అని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కచ్చితంగా సీరియస్ యాక్షన్కు దిగితే గానీ వీరు లైన్ లోకి రారని భావిస్తోంది. అందుకు మార్గాలను అన్వేషిస్తోంది. అయితే జగన్ ఆదేశాలతోనే వీరు అలా చేస్తున్నారని అనుమానిస్తోంది.డిజిపి ఆదేశాలను ధిక్కరించిన వారిలో ఐపీఎస్ లు సీతారామాంజనేయులు, పివి సునీల్ కుమార్, విశాల్ గున్ని, కేకేఎన్ అన్బురాజన్,తిరుమలేశ్వర్ రెడ్డి,సిద్ధార్థ కౌశల్,మేరీ ప్రశాంతి, జి ఆర్ రాధిక తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే చాలామంది ఐపీఎస్ లు సెలవు పై ఉన్నారు. మిగతా వారు మాత్రం డిజిపి ఆఫీసు వైపు చూసేందుకు కూడా ఇష్టపడడం లేదని తెలుస్తోంది. దీంతో వీరందరిపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలో ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే వైసిపి హయాంలో విపరీతంగా రెచ్చిపోయిన అధికారులకు జగన్ భరోసా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది అధికారులు వీఆర్ఎస్ తీసుకున్నారు.ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తక్కువ సర్వీసు ఉన్న అధికారులు విఆర్ఎస్ తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అందుకే ఒక నిర్ణయానికి వచ్చి డిజిపి ఆదేశాలను ధిక్కరిస్తున్నట్లు సమాచారం. మరి కూటమి ప్రభుత్వం వీరి విషయంలో ఎలా ముందుకెళ్తుందో నన్న చర్చ పోలీస్ శాఖలో బలంగా నడుస్తోంది.

# భారీ ప్రమాదం.. స్వల్పగాయాలు

**కాకినాడ :** కాకినాడ జిల్లా అన్నవరం నూతన నమూనా ఆలయం సమీపంలో కల్వర్టు వద్ద గురువారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో వెస్ట్ బెంగాల్ కు చెందిన లారీ క్రేన్ వాహనం ను ఢీకొట్టడం.క్రేన్ వాహనం లారీని ఢీకొట్టడం తో భారీ ఆస్తి నష్టనీ జరిగింది. లారీ కత్తి పూడి నుండి విశాఖపట్నం వెళుతూ అదే వైపు అన్నవరం నకు చెందిన కలుపుకురి సుభాష్ చెందిన క్రేన్ వాహనం ను బలంగా ఢీకొట్టడంతో ఆ తాకిడికి డివైడర్ దాటి విశాఖపట్నం నుండి కత్తిపూడి వైపు వెళ్తున్న హైవే రహదారి పైకి అకస్మాత్తుగా చొచ్చుకుపోయింది. దాంతో పప్పులు లోడుతో కలకత్తా నుండి నరసరావుపేట వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటన తీరు భారీ ప్రమాదనీగా కనపడుతుంది. విజయవాడకు చెందిన కోన దుర్గారావు కు తలకు గాయాలవ్వడంతో హుటాహుటిన హైవే అనీబులెన్సు వాహనం వచ్చి సిబ్బంది ప్రథమ చికిత్సచేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది పర్యవేంచారు.

## సామూహిక వ్రతంలో పాల్గొనే వారికి అన్నయ్య చీరలు

**కాకినాడ :** పిఠాపురం ఎమ్మెల్యేనా.. మజాకా నా అన్నట్టుంది పవన్ కళ్యాణ్ వ్యవహారం. తనను తొలిసారి అసెంబ్లీకి పంపిన పిఠాపురం పై ఆయన స్పెషల్ ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా ఆ నియోజకవర్గం లోని ఆడపడుచుల మనసులు గెలుచుకునేందుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రద్ధ చూపిస్తున్నారు. అందులో భాగంగా 12 వేల చీరలను పిఠాపురం లోని ఆడపడుచులకు పంచేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రతీ ఏడూ శ్రావణ మాసం చివరి శుక్రవారం నాడు ప్రముఖ పుణ్యక్షేత్రం పిఠాపురం లోని పురూహూతికా దేవలయం లో పెద్ద యెత్తున వరలక్ష్మి వ్రతాలు చేసుకుంటారు ఆడపడుచులు మాతృమూర్తులు. అదే కోవలో ఈ ఏడాది కూడా ఆగష్టు 30 న సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు ఆలయ అధికారులు. ఈ సందర్భంగా వ్రతం కోసం వచ్చే మాతృమూర్తులకు తన సొంత ఖర్చులతో చీరలు పంచేందుకు రంగం సిద్ధం చేశారు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. దీని కోసం ఇప్పటికే ఏకంగా 12 వేల చీరలను పిఠాపురానికి పంపించారు ఆయన. వీటిలో 6000 చీరలను పసుపు కుంకుమ తో కలిపి అమ్మవారి ప్రసాదం గా ఆలయం వద్ద పూజ ముగిసిన తర్వాత అందజేస్తారు.మిగిలిన 6000 చీరలను స్థానిక ఎమ్మెల్యే చేబ్రోలు పార్టీ ఆఫీసు లో ఆడపడుచులకు ఇస్తారు. ఈ ఏర్పాట్లను పార్టీ కీలక నేత హరిప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ ఈవో భవాని ఈ ఏడాది గతంలో లా కాకుండా మరింత విశాలమైన స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. మొత్తం మూడు బ్యాచులుగా మహిళలు ఈ వ్రతాన్ని చేసుకునేందుకు తగిన్ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మొత్తం మీద ఎమ్మెల్యే గా ఎన్నికైన తొలి ఏడాదే పిఠాపురం మహిళలకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత ఖర్చుతో ఏకంగా 12 వేల చీరలను పంచిపెట్టడం స్థానికంగా సంచలనంగా మారింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కలెక్షన్ కంత్రీ...!

ఎపిసోడ్- 1

**చక్రంతిప్పుతున్న కంప్యూటర్ ఆపరేటర్**
**జాబ్ కార్డులలోనూ చేతివాటం**
**నారాయణ చుట్టూ తిరుగుతున్న ఉపాధి సిబ్బంది**
**ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని ఉన్నతాధికారులు**
**ఇబ్బందిపడుతున్న ఉపాధి సిబ్బంది**
**ఇదీ మార్కాపురం ఏపిడి కార్యాలయం**
**కంప్యూటర్ ఆపరేటర్ తీరూ....తెన్నూ...!**





**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఆగస్టు 29)**

పేదలకు ఉపాధి కల్పించేందుకు వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకంతో జిల్లాలోనే వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో పేదలకు ఉపాధి కల్పించి వలసలు నివారించేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నా ఆ ఉపాధి కార్యాలయంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ చేస్తున్న నిర్వాకం, వసూళ్ళు, అజమాయిషీతో ఉపాధి సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. పనులు సైతం సకాలంలో ఏర్పాటు చేసి కూలీలకు వచ్చే వేతనాన్ని సైతం ఇప్పించలేకపోతున్నారు. ఉపాధి పనుల నుండి వేతనం చెల్లించే వరకు కంప్యూటర్ ఆపరేటర్‌దే కీలకం కావడంతో అతను చెప్పిందే వేదం, చేసిందే శాసనం లా మారింది. జిల్లా పునర్విభజనకు ముందు 5 మండలాలకు కలిపి నియోజకవర్గ పరిధిలో ఏపిడి కార్యాలయం ఉండేది. 5 మండలాల ఏపిఓలు మండల పరిధిలో పనులు చేయించి ఎంపిడిఓ లాగిన్ ద్వారా వేతనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసేవారు. అయితే ఏపిడి కార్యాలయాలను కుదించాలనే ప్రభుత్వ లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా గతంలో 12 ఏపిడి కార్యాలయాలు ఉండగా ప్రస్తుతం ఏడింటికి పరిమితమయ్యాయి. యర్రగొండపాలెంలో ఉన్న ఏపిడి కార్యాలయాన్ని మార్కాపురానికి మార్చి ఆ కార్యాలయంలో అదనంగా మార్కాపురం, దొనకొండ మండలాలను చేర్చారు. ఏపిడి కార్యాలయంలో ఏపిడిలు, మిగతా సిబ్బంది బదిలీ అవుతున్నా కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ మాత్రం బీష్మించుకు కూర్చుని పెత్తనం చలాయిస్తున్నాడు. దీంతో అతని పై అన్ని మండలాల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ బయటపడితే ఇబ్బంది పెడతాడని లోలోన మగ్గుతున్నట్లు పలువురు ఉపాధి సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు. ఇతని తీరూ...తెన్ను పై ఇటీవల పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ విచారణకు వచ్చిన అధికారులను మమ అనిపించి తిష్టవేసుకుని కూర్చున్నాడు. తన పైనే ఫిర్యాదులు చేస్తారా అంటూ తన ప్రతాపాన్ని మరింత ఎక్కువగా చూపు తున్నాడు.

**చక్రం తిప్పుతున్న నారాయణ**

ఆ కార్యాలయానికి మహిళా ఉద్యోగి ఏపిడిగా రావడంతో ఆమెకు తోడుగా మండలాలకు వెళుతూ ఆమెకు తెలియకుండానే సిబ్బంది పై పెత్తనం చలాయించడం ప్రారంభించాడు. భారీ స్థాయిలోనే వసూళ్ళకు ద్వారాలు తెరిచాడు. ఓ సందర్భంలో మహిళా ఏపిడి సెలవు పెట్టుకుని వెళ్ళాల్సిన పరిస్థితి కూడా నారాయణ వల్లే జరిగిందని ఉపాధి సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు.

**జాబ్ కార్డుల విషయంలోనూ చేతివాటం**

రైతులకు తమ పొలంలో పండ్ల తోటలు సాగు చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాలైన మొక్కలను పంపిణీ చేస్తారు. వాటి ఆలనా, పాలన కోసం మూడేళ్ళ వరకు ప్రభుత్వం రైతులకు నిధులు మంజూరు చేస్తుంది. అయితే పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఖచ్చితంగా జాబ్ కార్డులుండాలి. కొందరు రైతులకు జాబ్ కార్డులు లేకపోవడంతో ఆయా మండలాల నుంచి జాబ్ కోర్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కాకుండా జాప్యం జరిగేలా కంప్యూటర్ ఆపేరటర్ చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. దీంతో రైతులు నేరుగా మార్కాపురం ఏపిడి కార్యాలయానికి వెళ్ళి కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా జాబ్ కార్డులను కొట్టించి అవి మంజూరయ్యేలా కృషి చేయాలని కోరుతున్నారు. రైతుల బలహీనతలను, వారి అవకాశాన్ని ఆసరా చేసుకుని జిల్లా కార్యాలయంలో కొందరికి మాముళ్ళు ముట్టజెబుతూ రైతుల నుండి రూ.5 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా గత్యంతరం లేక రైతులు నారాయణ అడిగిన కాడికి ముట్టజెప్పి జాబ్ కార్డులుతెప్పించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు**

కంప్యూటర్ ఆపరేటర్ నారాయణ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పేరుకే కంప్యూటర్ ఆపరేటర్ అయినా ఏపిడి కార్యాలయంలో పెత్తనం అంతా నారాయణదే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నారాయణ పై లోతైన విచారణ చేపట్టి ఉపాధి సిబ్బంది ఇబ్బందులు తొలగించాలని పలువురు ఉపాధి సిబ్బంది కోరుతున్నారు.

## కష్టపడ్డ కార్యకర్తలను కలుపుకుపోవాలి

**ఎమ్మెల్యే దామచర్లకు సూచించిన సిఎం చంద్రబాబు**



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఆగస్టు 29)**

పార్టీలో కొత్తగా చేరే వారితో పాటు పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కలుపుకుపోయి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం మంగళగిరిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు నగర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని కాంక్షిస్తూ గత పది రోజుల క్రితం దామచర్ల జనార్దన్ సమక్షంలో వైసిపిని వీడిన (తరువాయి 4లో...)

## ప్రజల భాషగా తెలుగును తీర్చిద్దేందుకు పోరాటం చేసిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి

**జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వేంకట శ్రీనివాసులు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 29)**

గ్రాంధిక భాషా పదబంధాల మధ్య చిక్కుకున్న తెలుగు భాషను ప్రజల భాషగా తీర్చిదిద్దేందుకు పోరాటం చేసిన వాడుకభాష ఉద్యమ పిడుగు గిడుగు రామమూర్తి పంతులు అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ గిడుగు విశిష్ట సేవా పురస్కార గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు 162 జయంతి సందర్భంగా గాంధీపార్కు వద్ద ఉన్న తెలుగుతల్లి, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య, ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు ప్రకాశంజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి తెలుగుభాషా కీర్తిని కొనియాడారు. బెంగాల్, హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాషా (తరువాయి 4లో...)

## బాల బాలికలకు మంచి భవిష్యత్తివ్వడం కోసమే బంగారు బాల్యం

**బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 29)**

నిరాధారణకు గురైన బాల బాలికల భవిష్యత్ ను దృష్టిలో వుంచుకొని వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు రిమ్స్ ఆడిటోరియంలో బాలల హక్కులపై "బంగారు బాల్యం" పేరుతో జిల్లా యంత్రాంగం నిర్వహించిన ప్రత్యేక వర్క్ షాప్ లో నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వల గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలల బంగారు భవిష్యత్ వైపు ప్రకాశం జిల్లా 100 శాతం సాధన దిశగా అనే కాన్సెప్ట్ తో రూపొందించిన పోస్టర్ ను ప్రారంభించారు. నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ, నిరాధారణకు గురైన బాల బాలికల భవిష్యత్ ను దృష్టిలో వుంచుకొని వారికి అండగా ఉండాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. ప్రతి బిడ్డ సురక్షితంగా, స్వేచ్ఛగా, ఆరోగ్యంగా మరియు విద్యావంతులుగా ఉండేలా మరియు బాలల రక్షణ మరియు పిల్లల హక్కులకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కులు కాపాడటం, సమాజంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రకాశం జిల్లాలో బంగారు బాల్యం అనే వినుత్నమైన కార్యక్రమానికి రూపకల్పన చేసి, ఆ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు నన్ను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు. బంగారు బాల్యం కార్యక్రమం లక్ష్యాన్ని సాధించేలా ప్రతి ఒక్కరు నిబద్ధతతో (తరువాయి 4లో...)



## మిని థియేటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల, వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి

**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, ఆగస్టు 29)**

మండలంలోని శ్రీశైలం వెళ్లే రహదారిలో శ్రీశైల భ్రమరాంబ మిని థియేటర్ యజమాని మేడికొండ భవాని కనకయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్మించారు. గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం (తరువాయి 4లో...)



## కమ్యూనిటీ సెంటర్స్‌లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 29)**

కమ్యూనిటి హెల్త్ సెంటర్స్‌లో ప్రసవాల సంఖ్యను మెరుగుపరచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వైద్యాదికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ సుపరింటెండెంట్లతో సమావేశమై కమ్యూనిటి హెల్త్ సెంటర్స్‌లో అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ లో ప్రసవాల సంఖ్యను (తరువాయి 4లో...)

# ప్రజల భాషగా తెలుగును తీర్చిద్దేందుకు పోరాటం చేసిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి







తెలుగు అని, అజరామరమైన తెలుగు భాషను దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీబాత్‌లో ప్రశంసించటం తెలుగువారికి దక్కిన గౌరవమని పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. మాతృభాషలు అంతరించిపోకుండా చేపట్టాల్సిన చర్యలపై యునెస్కో హెచ్చరించిన నేపథ్యంలో మాతృభాషల పరిరక్షణ ప్రాధాన్యత పెరిగిందని ప్రరసం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి అన్నారు. తల్లిభాష తెలుగును ప్రేమిస్తాం, గౌరవిస్తాం, అమలుచేస్తాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. తెలుగుతల్లి, అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు ఏర్పాటు చేసిన లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును సత్కరించారు. తెలుగుభాష గొప్పదనాన్ని ప్రతిభవించే గీతాన్ని విశ్వకళాభారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ ఆలపించారు. కార్యక్రమంలో ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్, కనిగిరి సాహితీ సుధ ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, సినీ విశ్లేషకులు పొన్నలూరి జానకిరామ్, సంస్కారభారతి జిల్లా ప్రముఖ్ పత్తి రంగమన్నార్, మాంటిస్సోరి స్కూలు కరస్పాండెంట్ శబరినాథ్, ఓరియంటల్ సంస్కృత పాఠశాల గౌరవాధ్యక్షులు కోటి సూర్య నారాయణ, రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ధేనువకొండ సుబ్బయ్య, ఆంధ్రపద్య సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షులు మైనంపాటి సాయికుమార్, వ్యాఖ్యాత గుర్రం కృష్ణ, ఆధ్యాత్మిక ఉపన్యా సకులు చిలకపాటి రంగారావు, సాహితీ వేత్త గంగిశెట్టి నరసింహారావు, పౌర్ణమి గిరి ప్రదక్షణ అధ్యక్షులు రాఘవరెడ్డి, జి.గురవారెడ్డి, రైల్వే నాగేశ్వరరావు, సలార్, గర్నెపూడి వీరాంజనేయ ప్రసాద్, అమిరపు కోదండరామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మాంటిస్సోరి స్కూలు విద్యార్థులు పాల్గొని తెలుగుభాష గొప్పదనాన్ని కీర్తించారు.

# బాల బాలికలకు మంచి భవిష్యత్తివ్వడం కోసమే బంగారు బాల్యం



















పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు కలలు కంటేనే ఏమైనా చేయగలమన్నారు. ఆకలి అన్నింటిని తెలుసుకునేలా చేస్తుంది. అదే అవసరం కొత్త దారులను వెతికేలా మార్గాలు చూపిస్తుందని చెప్పారు. జీవితంలో ఎదగాలంటే చదువు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. నేడు సమాజంలో బాలల హక్కుల పరిరక్షణ అమలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పిల్లల ఆరోగ్యం, విద్య, పరిరక్షణ సూచించబడ్డాయని, ఆ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా నేను 25 సంవత్సరాల కాలంలో సుమారు 150 దేశాలలో పర్యటించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కైలాష్ సత్యార్థి బాలల హక్కుల పరిరక్షణలో తన అనుభవాలను, విశేషాలను వివరించారు. మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో వచ్చే సంఘటనలను దృష్ట్యా జిల్లా కలెక్టర్ జిల్లాలో వినూత్నంగా బంగారు బాల్యం అనే కార్యక్రమానికి రూపకల్పనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. బాల్యం గురించి, బాలల హక్కుల గురించి, బాల్యం విలువైందని తెలియచేస్తూ, చైతన్య పరస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలని సమిళితం చేసి ఆ ఫలాలు నిరాదరణకు గురైన బాల బాలికలకు అందించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలల హక్కుల కోసం, బాల కార్మికుల విముక్తి కోసం, బాలల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నోబుల్ గ్రహీత కైలాష్ సత్యర్ధి ని ఈ కార్యక్రమానికి ఆహ్వానించచడం జిల్లా కలెక్టర్‌ను ఈ సంధర్భంగా మంత్రి అభినందించారు. బాలల హక్కుల పరిరక్షణకు చేస్తున్న కృషిని మనతో పంచుకోవడానికి జిల్లాకు వచ్చిన నోబుల్ గ్రహీత కైలాష్ సత్యర్థికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞలు తెలియచేశారు. బాల బాలికల హక్కులను కాపాడటం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నదన్నారు. ఈ రోజు సమాజంలో చిన్న పిల్లలపై జరుగుచున్న అత్యాచార సంఘటనలు మనం చూస్తా వున్నాం. సమాజంలో వున్న ఆర్థిక పరిస్థితులు కావచ్చు తల్లిదండ్రుల పేదరికం, విద్య లేకపోవడం, పిల్లలు నిరాదరణకు గురైన సమయంలో బాల్య వివాహాలు జరుగుచున్నవవి, ఈ పరిస్థితుల్లో బాలికలను విద్యావంతులను చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు నడుపుతున్నట్లు మంత్రి తెలిపారు. ఎవరైనా ప్రత్యేక పరిస్థితుల్లో వున్న పిల్లలను గుర్తించి వారికి విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్మీడియట్ తరువాత చాలా మంది ఆడపిల్లలకు వివాహాలు చేస్తున్నారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆద్వర్యంలో సింగరాయకొండలో డిగ్రీ కళాశాలను కూడా ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. పెళ్లి అనే ఆప్షన్ కాకుండా విద్య అనే ఆప్షన్ తో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నట్లు మంత్రి తెలిపారు. అనురాగం అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చి తల్లిదండ్రులు లేని వారికి కూడా వసతిగృహాల్లో భోజన వసతి కల్పిస్తునట్లు మంత్రి వివరించారు. సమాజంలో నిరాధారకు గురైన పిల్లలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంది అనే భరసాతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ వారిలో విద్యను ప్రోత్సహిస్తున్నట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మన జిల్లాలోనే బంగారు బాల్యం అనే పేరుతో వినూత్నంగా ప్రారంభించిన బంగారు బాల్యం కార్యక్రమాన్ని గ్రామ స్థాయి కమిటీలన్నీ నిబద్దత, అంకిత భావంతో పని చేసి ప్రకాశం జిల్లాను బంగారు బాల్యం, బంగారు ప్రకాశం అనే విధంగా ముందుకు తీసుకుపోయేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముందుగా మంత్రి అందరికి మాతృ బాష దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నిరాధరణకు గురైనన బాల బాలికలకు మంచి భవిష్యత్ కల్పించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో జిల్లాలో ఈ రోజు 'బంగారు బాల్యం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. బాలల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిని ఇస్తున్న కైలాష్ సత్యార్థి ఈ కార్యక్రమానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో పిల్లలందరినీ (0-18) సంతోషంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా, సాధికారతతో తీర్చిదిద్దడమే బంగారు బాల్యం కార్యక్రమం లక్ష్యమన్నారు. పిల్లలను కేంద్ర బిందువుగా కలిగి ఉన్న వాటాదారులందరినీ కలుపుకొని సమగ్ర పద్ధతిలో పిల్లలందరి సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడం జరుగుతుందన్నారు. పిల్లల నిర్దిష్ట సూచికల ఎంపిక మరియు లక్ష్యాన్ని నిర్దేశించడం, సర్వైవల్, హెల్త్ మరియు న్యూట్రిషన్, విద్య మరియు అభివృద్ధి, రక్షణ మరియు భద్రత, 100% జనన నమోదు, బాల్య పోషకాహార లోపాన్ని 100% తగ్గించడం, మహిళలు, కౌమారదశలో ఉన్న బాలికలు మరియు పిల్లలలో రక్తహీనత 100% నివారణ ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామం, బ్లాక్ స్థాయి మరియు నియోజకవర్గ స్థాయిలో 100% ఫంక్షనల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రతి బిడ్డ సంతోషకరమైన, ఆరోగ్యకరమైన మరియు సంపూర్ణమైన బాల్యం కోసం హక్కును నిర్ధారించడానికి రూపొందించిన బంగారు బాల్యం కార్యక్రమ ప్రారంభానికి ప్రఖ్యాత భారతీయ బాలల హక్కుల కార్యకర్త మరియు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి రావడం వారి ఆలోచనలు, వారి అనుభవాలు మనతో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, మనందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లల్లు స్కూల్ కు వెళ్ళేలా చేయడం, వారికి తగిన గుర్తింపు ఇవ్వడం, వారి హక్కులను పరిరక్షించడం అందరి భాద్యతన్నారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణతో పాటు బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా పోలీసు శాఖల తమ వంతు కృషి చేస్తుందన్నారు. బాల కార్మికుల నిర్మూలనలో భాగంగా ఈ నెల 1 నుండి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో గుర్తించి స్కూల్ లో చేర్పించబడిన బాల కార్మికులను ఈ సందర్భంగా నోబుల్ గ్రహీత కైలాష్ సత్యార్థి, మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, శిశు సంక్షేమ శాఖ పిడి మాధురి, దలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం ఉప సంచాలకులు రవి కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిని థియేటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల, వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి





నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబులకు శాలువాలు, పూలమాలతో ఘనస్వాతం పలికారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన శ్రీశైల భ్రమరాంబ మిని థియేటర్ ను లాంఛనంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు,ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుల రామిరెడ్డి, మేడికొండ భవాని కనకయ్య చౌదరి, మండల టిడిపి కన్వీనర్ యేర్వ మల్లికార్జున్‌రెడ్డి, రావిక్రింది సుబ్బరత్నం, మాజీ సర్పంచ్ వెచ్చ హర గోపాల్, కొప్పుల వెంకటసుబ్బారెడ్డి, మండల జనసేన కన్వీనర్ కేతి వెంకట మురళి, నాగేళ్ల రమేష్, చిన్న వెంకటేశ్వర్లు(చంటి), తంగిరాల చెన్నారెడ్డి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ సెంటర్స్‌లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలి



మెరుగుపరచేలా చర్యలు తీసుకోవాలని డి.సి.హెచ్.ఎస్‌ను ఆదేశించారు. ఆరోగ్యవంతమైన తల్లి బిడ్డల సంరక్షణ లక్ష్యంగా వైద్య సేవలను అందించాలని కలెక్టర్, వైద్యాదికారులను ఆదేశించారు. గిద్దలూరు, పామూరు, కంభం, యర్రగొండపాలెం సి.హెచ్.సి లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రసవాలు నిర్వహించలేదని, ఈ సెంటర్స్‌లో ప్రసవాల సంఖ్యను మెరుగుపరచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల నందు సౌకర్యాలు, సదుపాయాలు, సిబ్బంది కొరత తదుపరి అంశాలపై సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల నందు సౌకర్యాలను పెంచాలన్నారు. రోగులకు మంచి వైద్యం అందించాలన్నారు. జిల్లాలో వున్న కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ వారిగా ఖాళీగా వున్నా పోస్టుల వివరాలను, అవసరమైన వైద్య పరికరాల వివరాల నివేదికను సమర్పించాలని కలెక్టర్, డిసిహెచ్ఎస్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శేషు, కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ సుపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ కార్యకర్తలను కలుపుకుపోవాలి



ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), వైసిపి కార్పొరేటర్లు టీడీపీలోకి చేరిన సందర్భంగా దామచర్ల జనార్ధన్ ఒంగోలు నగర కార్పొరేటర్స్ అందరిని తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధి కోసం మీరంతా పార్టీలోకి రావడం సంతోషం, పార్టీ కోసం కష్టపడ్డ వారికి ఇబ్బంది లేకుండా అందరిని కలుపుకొని పోవాలి అని ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒంగోలు నగర అభివృద్ధి కి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. నారా లోకేష్ పాదయాత్ర హామీ మేరకు ఒంగోలు నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, టీడీపీ, జనసేన కార్పొరేటర్స్ పాల్గొన్నారు.

## ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 29)

ఆగి ఉన్న కారును లారీ ఢీకొన్న సంఘటన గురువారం మండల పరిధిలోని కరేడు పంచాయతీ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కరేడు పంచాయతీ కోకో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ సమీపంలో గురువారం హైవే పై టయోటా కారు చెన్నై నుండి విజయవాడ వెళుతూ భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో హైవే పక్కన ఆగింది. అదే మార్గంలో చెన్నై నుంచి దాచేపల్లి వెళుతున్నటువంటి సిమెంటు ట్యాంకర్ డ్రైవర్ నిద్ర మత్తులో హైవే ప్రక్కన ఆగి ఉన్న కారును వెనుక భాగం ఢీకొట్టడంతో కారు వెనుక భాగం నుజ్జు నుజ్జు అయ్యి ప్రక్కనే ఉన్న చెట్లు పొదలలోకి వెళ్లిపోయింది. కారులో డ్రైవరు ఒక్కరే ఉండటంతో ప్రమాదం నుంచి డ్రైవర్ తప్పించుకున్నారు. ఎటువంటి ప్రాణహాని జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 29)

మండలంలోని బడుగులేరు పంచాయతీలో మాజీ సర్పంచ్ రమణమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ముసలయ్య, వంశీ, నాగరాజు, రవీంద్ర, బత్తుల మాలి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గోబ్బిళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కుడుముల వారి వివాహ వేడుకలో వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, ఆగస్టు 29)

కుడుముల వారి పరిశుద్ధ వివాహ వేడుకలో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందజేశారు. మండలంలోని వెంగళాయిపల్లి ఎస్సీ కాలనీలో కుడుముల యేసేబు, రూతమ్మల కుమారుడు కొండలరావు వివాహ వేడుక గురువారం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న దద్దాల నారాయణ యాదవ్ కేక్ కట్ చేసి వారికి తినిపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు గోపవరపు బొర్రారెడ్డి, మాజీ సర్పంచ్ శీలం సుదర్శనం, మండల యూత్ అధ్యక్షులు మేకల మాల్యాద్రి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గోబ్బిళ్ల శ్రీను, యేరువ నరసింహం, కరణం మహాలక్ష్మయ్య, ఉండెల వెంగలరెడ్డి, వైసీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ కోకన్వీనర్ అత్యాల ఇస్సాకు, అత్యాల డేవిడ్, అత్యాల హనోకు, ముప్పారపు ఆశీర్వాదం, అజార్య, వడ్డె రత్తయ్య, అత్యాల పేతురు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తెలుగుభాషా దినోత్సవం, ఘనంగా క్రీడా దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 29)

తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలం, గోవర్ధనపురం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ప్రధాన ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి అధ్యక్షత వహించారు.తెలుగు పండితులు సుమతి, మునెయ్య లు తెలుగుదనం ఉట్టి పడేలా కార్యక్రమం రూపొందించారు.ఈ సందర్భంగా సుమారు 100 మందికి పైగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు.అందులో తెలుగుతల్లి వేషధారణ ఉపన్యాసం, వ్యాస రచనలు,పద్య పఠనం,గద్య పఠనం,నాటకాలలోని కొన్ని ముఖ్య సన్నివేశాలు(పరమానందయ్య శిష్యుల హాస్యం),తెలుగు దనం ఉట్టి పడే ఆట పాటలు,లాంటి కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.పౌర మానవ హక్కుల సంస్థ(సీసీఆర్)రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తి త్యాగరాజు,స్వచ్ఛత్ గ్రామీణ మరియు పట్టణ అభివృద్ధి సంఘము సంయుక్త ఆధ్వర్యంలో మావూడూరు మోహన్ తెలుగు పండితులు మునెయ్య, సుమతి లను ఘనంగా సత్కరించారు,గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని,ఆయన సామాన్యులు సైతం అర్థం చేసుకునేలా తెలుగును సరళీరణ చేసిన మహోత్తముడు అని అన్నారు.ఎందరో తెలుగు కవులు తమ కవిత్వాలు,శతకాల ద్వారా జాతిని మేల్కొలిపారని అన్నారు. తెలుగు భాషా ఔన్నత్యాన్ని,భాష మనుగడ,భవిష్యత్ లో తెలుగు భాషా ఉనికి,జీవన విధానం లో ఇతర భాషల ప్రాధాన్యత తదితర విషయాలపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వక్తలు ఉపన్యసించారు.క్రీడలకు సంబందించి వ్యాయామ ముద్దుకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఉపాధ్యాయుడు హరినాద్ రెడ్డి మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయంను విషయం తెలిపారు.మేజర్ ధ్యాన్ సింగ్, ధ్యాన్ చంద్ ఎలా పిలవబడ్డారు అని తెలియజేసి,అతని లక్ష్య సాధన గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా,అర్థమయ్యేలా తెలిపారు.ఈ రెండు పర్వ దినాలను పురస్కరించుకొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెరుమాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కులశేఖర్, లోకేశ్వర్, హరినాధ్, పద్మావతి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన







(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 29)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారం తో నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి-పి.యు ప్రాజెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో " మీకు తెలుసా? కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి, ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నీ సూళ్లూరుపేట లోని పరమేశ్వరి నగర్, సంతోష్ కాలనీ ఏరియాలలో నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ హెచ్.ఐ.వి వ్యతిరేక నినాదాలతో సాగింది. అంతే కాకుండా హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి, ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి, ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి, ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఎ.పి.శాక్స్ ఆప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలిపారు. ఈ ర్యాలీలో 150 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓ.ఆర్.డబ్ల్యూలు కె మంజుల, టి నందిని, ఎ.యన్.యమ్ జి హరిత, పి.ఇ లు ఎ. మరియమ్మ, యల్. శిరీష, కె శ్రీ వల్లిక, కె రేవతి, యన్. రేవతి, ఆర్. ఉమ, ఇతర ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 25 మందికి సంస్థ ఎ.యన్.యమ్ అయిన జి. హరిత ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

## అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య నిలయాలుగా తీర్చిదిద్దండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 29)

అంగన్వాడీ కేంద్రాలను ఆరోగ్య నిలయాలుగా తీర్చి దిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలసి కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సీపిసీఆర్) సభ్యులు గొండు సీతారాం అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలోని మెయిన్ అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం అధికారులతో కలసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు,కేంద్రంలో పిల్లలకు,గర్భిణీ,బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం సరఫరాపై లబ్ధిదారులతో మాట్లాడారు,నిత్యం కేంద్రాలను తనిఖీలు చేస్తూ పిల్లలకు,లబ్ధి దారులకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన గురుతర బాధ్యత తీసుకోవాలని సూచించారు,అనంతరం స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు,బియ్యం,కోడి గుడ్లు,కందిపప్పు,బాలామృతంతో పాటు ఇతర పదార్థాల నాణ్యత ప్రమాణాలు,కాలవ్యవధి తేదీలను ఖచ్చితంగా గమనిస్తూ సిబ్బంది జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు,రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి నిలపడంతో పాటు పారదర్శక విధానంతో పనిచేసేలా ఉన్నతాధికారులకు ఆదేశాలు,సూచనలు, సలహాలు అందజేస్తూ వస్తున్నట్టు తెలిపారు. వెంకటాచలం ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి విజయ లక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు పరిగణనలోకి తీసుకుంటూ అంగన్వాడీ కేంద్రాలను ప్రగతి పథంలో నడిపేందుకు ఎల్లపుడూ కృషి చేస్తామని అన్నారు. ఈ పర్యటనలో అంగన్వాడీ సూపర్వైజర్ బి.పద్మజ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఎం.మస్తాన్ బాబు,గీత,తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దొరవారిసత్రం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జి.అజయ్ కుమార్ ఎస్ఐ

(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 29)

అజయ్ కుమార్ గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా లోని గూడూరు పోలీస్ సబ్ డివిజన్లో పలు పోలీస్ స్టేషన్లో పని చేసి మంచి పోలీస్ అధికారిగా పేరు వుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.



## భూమి వివాదాల పరిష్కారానికి ఉమ్మడి సర్వే

### కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం

(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 29)

వరదయ్యపాలెం మండలం, చెదులుపాకం రెవెన్యూ బత్తలవల్లం గ్రామంలోని వివాదంలో ఉన్న భూమిని గురువారం రెవెన్యూ,అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మండల తాశీల్దారు పి.రాజశేఖర్ పరిశీలించి రెవెన్యూ హద్దులు ఎక్కడ నుంచి ఎంత వరకు వస్తాయో మ్యాప్ ద్వారా గుర్తించి ఈ వివాదాలకు రెండు శాఖలు చొరవ తీసుకొని, సమగ్ర సర్వే ద్వారా సమస్యను పరిష్కరించే ఏర్పాటు త్వరలోనే రెవెన్యూ,అటవీ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహిస్తామని తాశీల్దారు త్వరలోనే అప్పగించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారి తెలిపారు. గ్రామ ప్రజలు ఆందోళన తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గ్రామప్రజలపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యం సహించేదిలేదని సూచించారు.



# తెలుగు వ్యవహారిక భాషకు గిడుగు సేవలు మరువలేనివి

- నివాళులర్పించిన కలెక్టర్ ఆనంద్
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 15)

తెలుగును వాడుక భాషగా తీసుకురావడానికి గిడుగు వెంకటరామమూర్తి ఎంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లో గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుభాషకు గిడుగు వెంకటరామమూర్తి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. గ్రాంధిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకుని భాషను అందరికి సులభతరం చేసిన గొప్ప చరిత్రకారుడు, బహుభాషా శాస్త్రవేత్త గిడుగు వెంకటరామమూర్తి అని కొనియాడారు. గిడుగు భాషోద్యమం వలన ఏ కొందరికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలుగుభాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు రామమ్మూర్తి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. తొలుత గిడుగు చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్వో లవన్న తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, అధికారులు, సిబ్బంది గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్లోని కార్యాలయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. సదారావు, జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ చందర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహిద్దాం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 29)**
క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర అనే కాన్సెప్ట్ తో విజయవంతం గా సెప్టెంబర్ 2 న డిప్యూటి సిఎం జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఆగష్టు 30 నుంచి 4 రోజులు నిర్వహించడం జరుగుతుందని కిశోర్ అన్నారు. జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయం గోమతి నగర్ నందు జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనల తో జనసేన కోర్ కమిటీ సిటీ రూరల్ డివిజన్, ముఖ్య నాయకులు జనసేనాని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేడుకల విషయమై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ సిటీ రూరల్ జన సైనికులు కలసి పర్య పర్యావరణ పరిరక్షణ గురించి వివరిస్తూ కార్యక్రమాలు ఒక పండుగ వాతావరణంతో పవన్ కళ్యాణ్ జన్మదిన ప్రోగ్రాంలు నిర్వహించబోతున్నామన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జిల్లా కార్యాలయం తరపున జరగబోవు కార్యక్రమాల వివరాలు ఇలా...30 ఆగస్టు 2024 ఉదయం 8.30 రాజ రాజేశ్వరి గుడి లో పూజ, 31 ఆగస్టు 2024 గాంధీ బొమ్మ సెంటర్ వద్ద దేశీయ వృక్ష జాతుల 1000 మొక్కల పంపిణీ నాటుట,సంరక్షణ పర్యవేక్షణ కార్యక్రమం, సాయంత్రం 4గం.కి పెద్ద ఆసుపత్రి పరివాహక ప్రదేశాలలో పారిశుధ్య నిర్వహణ, సెప్టెంబర్ 1 2024 జనసేన పార్టీ జిల్లా కార్యాలయం,గోమతి నగర్ నందు బ్లడ్ డొనేషన్ కార్యక్రమం, సెప్టెంబర్ 2,2024 ఉదయం 10 గంటలకు జనసేన పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఆర్గాన్ డొనేషన్, మధ్యాహ్నం 12గం కి మార్కెట్ సెంటర్, మద్రాసు బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నర్తకి సెంటర్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు.

**సమిష్టిగా కార్యక్రమాలు నిర్వహించుకుందాం**

జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు విడివిడిగా కాకుండా జిల్లా కార్యాలయం కేంద్రంగా కాకుండా అందరూ ఒకటిగా ఈ కార్యక్రమాలు విజయవంతం చేసుకుందాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, జమీర్, చంద్రశేఖర్ రెడ్డి, మురళీకృష్ణ, శ్రీరామ్, శ్రీపతి రామకృష్ణారెడ్డి, ఈగి సురేష్, చదలవాడ రాజేష్, రుషి, మురళి రెడ్డి, పవన్, సుధామాధవ్, హేమచంద్ర యాదవ్, వర, శరవణ, పేనేటి శ్రీకాంత్, శనత్, షఫీ, కన్నా, సూరి సురేష్, శ్రీకాంత్, అజీజ్, సీనయ్య, మహేష్ శర్మ, నందిని, ప్రసన్న, గజరాజు శాంతికల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 29)**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురంలో తెలుగు భాషకు గొడుగు, గ్రాంథిక భాషా వాదులకు చిచ్చర పిడుగు, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు



రామమూర్తి పంతులు గారి జయంతి అయిన తెలుగు భాషా దినోత్సవం మరియు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ గారి జయంతి అయిన జాతీయ క్రీడా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పద్యాల అంత్యాక్షరి, వ్యాసరచన, వక్తృత్వ, క్రీడల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వక్తలు గిడుగు రామమూర్తి పంతులు భాషాసేవను, ధ్యాన్ చంద్ గారి క్రీడా స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమమునకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాతం శ్రీనివాసరావు గారు, తెలుగు భాషోపాధ్యాయులు ఆర్. శ్రీనివాసులు, ఎం. శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు పి. అహ్మద్ భాష, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ మార్క్స్ క్రీడా ప్రాంగణం నందు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 29)**
ఆగస్టు 29 హాకీ మాంత్రికుడుగా పేరుపొందిన మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు అనేక ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ యం జయకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు కేవలం మానసిక ఆనందం కోసం కాదు, ఆటలు ఆడటం వలన శారీరక దృఢత్వం, ఆరోగ్యం మానసిక వికాసం కలిగి ఉత్సాహంగా ఉంటారని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు ఎంతో అవసరం అని కావున క్రీడలకు కూడా సమయం కేటాయించి ప్రతి శనివారం క్రీడలాడించడం వలన సెయింట్ మార్క్స్ విద్యార్థులు దృఢంగా ఉంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం కుడా నిర్వహించారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం నందు తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు




**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 29)**
నాయుడుపేట నందు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మాతృభాష గొప్పదనం గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవ నేటితరం విద్యార్థులకి పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ దాదా పీర్ చాలా గొప్పగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు మరియు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని జయప్రదం చేశారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అదితిగా జూడో రాష్ట్ర అధ్యక్షుడు మరియు తినిటి హాస్పిటల్ చైర్మన్ ఆడవరం మావురయ్యా, సిరి ఫర్నిచర్ సుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దాదా పీర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి క్రీడలకు సంబంధించి ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి అవసరం ఉన్నా అన్ని ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే కుస్తీ పోటీలకు సంబంధించి 50 మ్యాట్లను అంబేద్కర్ గురుకులం కు అందజేస్తామన్నారు. ఇంకా భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా తాను ముందు ఉంటానన్నారు. గురుకులం నందు గ్రౌండ్ లేనప్పటికీ గతంలో 57 స్టేట్ పథకాలు ఆరు జాతీయ పథకాలు సాధించినటువంటి విద్యార్థులను అభినందించారు. అలాగే విద్యార్థులకు తరఫున పిఈటి భాస్కర్ గారిని ఉదయిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాదా పీర్ ,మల్లికార్జున రావు, మోహన్ రావు ,రాజశేఖర్, వెంకటకృష్ణయ్య , జే.వెంకట రమణయ్య, బందెల.శేఖర్ బాబు, పిఈటి భాస్కర్ ,పిడి కాటయ్య, రెజ్లింగ్ కోచ్ ఉదయ్, కుమార్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దామచర్ల సక్కుబాయిమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ

## కళాశాల(అటానమస్)లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 29)**
స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యక్షురాలు పి యామిని అమ్మాజీ ఆహ్వానం పలుకగా , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి కళ్యాణి "ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే" అన్నట్లు తెలుగు భాష ప్రాముఖ్యతను మర్చిపోకూడదని, మన మాతృభాష అయిన తెలుగు భాషని గౌరవించుకోవాలని ,తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని హితవు పలికారు. శ్రీమతి పి.యామినీ అమ్మాజీ మాట్లాడుతూ స్వర్గీయ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు వ్యవహారిక భాష ఉద్యమాన్ని సాగించార ని, వారి కృషి ఫలితంగా తెలుగు గ్రాంధిక చెర తప్పించుకొని వ్యవహారిక భాషగా స్థిరపడిందని, గురజాడ ,కందుకూరి వంటి వారి సహకారంతో వ్యవహారిక భాషగా తెలుగుని గెలిపించిన ధీరుడు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారని ,వారి భాషా ఉద్యమాన్ని వివరిస్తూ వారి జన్మదినాన్ని వ్యవహారిక భాషా దినోత్సవం గా, క్రమేణ తెలుగు భాష దినోత్సవం గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని వివరించి ,ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాచీనతను, తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డోలా అనంతలక్ష్మి గారు విద్యార్థులందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియపరచి ప్రతి ఒక్కరూ తెలుగు భాషకి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీర్వదించారు. అకడమిక్ కౌన్సిల్ డాక్టర్ ఎం .శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఇంట గెలిచి రచ్చ గెలిచినట్టుగా ముందు మాతృభాషలో ప్రావీణ్యత సంపాదించుకొని ,దాని ఆధారంగా ఇతర భాషలు నేర్చి తెలుగుతనానికి వన్నె తీసుకురావాలని ఉద్బోధించారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యతను తెలిపే పాటల పోటీ నిర్వహించబడింది. కుమారి మాళవిక తెలుగు తల్లి వేషధారణతో అలరించినది. కుమారి పూజిత బృందం ప్రదర్శించిన" తెలుగు భాష గొప్పతనం తెలుగు భాష కమ్మదనం" నృత్యం అందరినీ ఆకట్టు కొన్నది. "నా పాట తెలుగు పాట అంటూ" బి. ఏ విద్యార్థిని ప్రణతి ఆలపించిన గానం అందరిని అలరించినది. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అధ్యాపకులు శ్రీమతి సరళ, సుష్మ, ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి గార్లు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.



# చుంచులూరు కాలనిలో తీవ్ర విషాదం

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి





**(షణ్ముఖ వెలుగు, మర్రిపాడు, ఆగస్టు 29)**
మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామానికి చెందిన బోటిక శ్రీనివాసులు భార్య కుమారుడుతో కలిసి వివాహానికి హాజరు కావాలని బెంగులూరు నుంచి సొంత గ్రామం చుంచులూరు కు కారులో వస్తూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులు బోటిక శ్రీను, పుష్ప (చిలకమ్మ ), కుమారుడు శ్రీకాంత్ చింతామణి సమీపంలో దండుపాళ్య గేట్ సమీపంలో బోయకొండకు వెళ్లి ఎదురుగ వస్తున్న టెంపో ట్రావలర్ ను ఓవర్ టేక్ చేయబోయి బలంగా కారు గుద్దడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలియజేస్తున్నారు.

# నెల్లూరు మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు కేటాయించండి

## ఎంపీ వేమిరెడ్డి

### నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ గంగాధర్‌కు విన్నపం సానుకూలంగా స్పందించిన ఛైర్మన్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 29)**
జిల్లాకు ప్రతిష్టాత్మకమైన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి కొత్తగా సీట్లు కేటాయించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌కి విన్నవించారు. ఈ మేరకు ఢిల్లీ వెళ్లిన ఎంపీ, కమిషన్ కార్యాలయంలో గంగాధర్‌ని కలిసి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నెల్లూరు బ్రాంచ్ తరఫున వినతిపత్రాన్ని అందించారు. 2024-25 సంవత్సరానికి నెల్లూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ విభాగంలో కొత్తగా సీట్లు కేటాయించడం ద్వారా యువ డాక్టర్లకు సీట్లు అందుబాటులోకి వచ్చి పేదలకు మంచి వైద్యం అందుతుందన్నారు. జిల్లా వైద్యశాల అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గంగాధర్ గారు.. సీట్ల కేటాయింపుపై తప్పకుండా కృషి చేస్తామని అన్నారు.

# నీతి ఆయోగ్ సీఈవోతో ఎంపీ వేమిరెడ్డి భేటీ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 29)**
నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలోని నీతి ఆయోగ్ కార్యాలయానికి వచ్చిన ఎంపీ గారు.. సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి శ్రీ వారి ప్రసాదం అందించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు.. సుబ్రహ్మణ్యంతో భేటీ అయి వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. పలు అంశాలను సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు.

# ప్రకాష్‌రెడ్డిని పరామర్శించిన వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల



**(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, ఆగస్టు 29)**
అనారోగ్యం కారణంగా నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న మండల వైసీపీ నాయకులు ప్రకాష్ రెడ్డిని గురువారం కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గోబ్బిళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## జరుగుమల్లి ఎస్ఐగా పున్నారావు



(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, ఆగస్టు 29)
జరుగుమల్లి ఎస్ఐగా పున్నారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు ను విఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పున్నారావు మాట్లాడుతూ అక్రమ ఇసుక, పేకాట, కోడిపందాల పై ప్రత్యేకంగా నిఘా ఉంచుతామన్నారు. అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద దోర్నాల నూతన తాసిల్దార్‌గా కిన్నెర శాంతి బాధ్యతల స్వీకరణ



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, ఆగస్టు 29)
పెద్ద దోర్నాల మండల నూతన తాసిల్దార్‌గా కిన్నెర శాంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాసిల్దార్ కిన్నెర శాంతి గతంలో పొదిలిలో పనిచేస్తూ బదిలీలలో భాగంగా దోర్నాలకు వచ్చినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు రెవిన్యూ శాఖపరమైన విషయాలలో ఇబ్బందులు లేకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి తోడ్పాటు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్‌కు మండలంలోని వివిధ గ్రామాల నుండి నాయకులు, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు





(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, ఆగస్టు 29)
మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం(ధ్యాన్ చంద్ జయంతి)ను గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సావిత్రి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం గురించి, గిడుగు వెంకట రామమూర్తి గురించి పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు జ్యోతి ని సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తెలుగు పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె. విజయబాబు, ఎన్ జయసింహ, జి రమేష్, డాక్టర్ శ్రీనివాసచార్యులు, డాక్టర్ ఓ నాగరాజు, ఎస్‌కె అక్రమ్, ఆధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మహమ్మద్ ఖలీల్‌ను పరామర్శించిన మాజీ మంత్రి అనిల్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 29)
హృదయసంబంధ అనారోగ్యంతో మెడికవర్ హాస్పిటల్ నందు చికత్స పొందుతున్న నెల్లూరు సిటీ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మహమ్మద్ ఖలీల్ అహమద్ ని మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ పరామర్శించి వారి ఆరోగ్యపరిస్థితులు తెల్సుకున్నారు, వారి ఆరోగ్యపరిస్థితి గురించి సమీక్షించారు, వారి వెంట నెల్లూరు నగర కార్పొరేటర్లు, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అనిల్ ,మైనారిటీ నాయకులు వైసీపీ నాయకులు కూడా ఖలీల్ ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# ఉద్యోగ ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్న జూలకంటి

### నాడు నాగిరెడ్డి నేడు బ్రహ్మారెడ్డి నిరుద్యోగ యువకులకు అభినవ బాలచంద్రులు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 29)
మాచర్ల నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే ధ్యేయంగా మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పనిచేస్తూనే ఉన్నాడు. అందుకు అనుగుణంగా తాను ప్రమాణ స్వీకారం చేసిన 100 రోజుల లోపల మెగా జాబ్ మేళా నిర్వహించి సుమారు 803 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఆఫర్ లెటర్లు ఆయా మల్టీ నేషనల్ కంపెనీల ద్వారా అందించారు. వీరిలో సుమారు 450 మంది విధుల్లో చేరిపోయారు. మాచర్ల నియోజకవర్గ ప్రజలు తనకు అందించిన అఖండ విజయం తన భుజస్కందాలపై పెద్ద బాధ్యతనే ఉంచారని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం అందించే నోటిఫికేషన్ లపై ఆధారపడకుండా దేశంలోని పలు మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి వారిని మాచర్ల నియోజకవర్గానికి ఆహ్వానించి ఈ ప్రాంత ప్రజల సమస్యలను వివరించి వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం ఆయన ముందు చూపుకు నిదర్శనం అని పలువురు రాజకీయ పండితులు కొనియాడుతున్నారు. జూలకంటి బ్రహ్మారెడ్డి తండ్రి జూలకంటి నాగిరెడ్డి రెండు పర్యాయాలు గురజాల మాచర్ల ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన సమితి ప్రెసిడెంట్ గా పనిచేసిన సమయంలోనే పల్నాడు ప్రాంతంలో అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇప్పటికీ ఆయన ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందిన ఆ కుటుంబ సభ్యులు జూలకంటి కుటుంబానికి వీరవిధేయులుగా ఉంటూ వస్తూ ఉన్నారు. సుదీర్ఘకాలంగా మాచర్ల సమితి ప్రెసిడెంట్ గా పనిచేసినా, గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా పనిచేసిన, నాగిరెడ్డి సతీమణి జూలకంటి దుర్గాంబ ఒక పర్యాయం మాచర్ల ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ ఆస్తులు కోల్పోయారే తప్ప ఆస్తులు కూడా కట్టలేదని నిజాయితీకి జూలకంటి కుటుంబం నిదర్శమని గురజాల మాచర్ల నియోజకవర్గ ప్రజలు వారిని అభిమానిస్తూ వారి వెన్నంటి నడుస్తున్నారు. గడచిన 20 సంవత్సరాలుగా మాచర్ల నియోజకవర్గం లో నిరుద్యోగ యువకులు భారీగా పెరిగి ఉన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కనుచూపుమేరా కనిపించకపోవడంతో యువత నిరాసాని స్పృహలో మునిగిపోయి ఉన్నారు ఈ సమయంలో జూలకంటి బ్రహ్మారెడ్డి నిరుద్యోగ యువతకు నేను ఉన్నాను అంటూ మెగా జాబ్ మేళా నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి అభినవ బాలచంద్రుడిగా వారి మనసుల్లో సుస్థిర స్థానం బ్రహ్మారెడ్డి సంపాదించుకున్నాడని పలువురు యువకులు అభినందిస్తున్నారు. మాచర్ల నియోజకవర్గం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి సామాజిక న్యాయం చేస్తానని సాగునీరు త్రాగునీరు మెరుగైన వైద్యం మెరుగైన విద్య ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ధ్యేయం అంటున్న బ్రహ్మారెడ్డి వెంట నడిచేందుకు యువత ఉత్సాహంగా ఆసక్తి చూపుతున్నారు.



# అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది

### వైపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 29)
అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పది అని ముస్లీ యూత్ సోసైటి ఆదిశగా తమ కార్యాకలపాలు సాగించడం అభినందించ దగ్గవిషయమని యర్రగొండపాలెం తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కొనియాడారు. ముస్లీయూత్ సోసైటి అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకు రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ముస్లీం యూత్ సోసైటి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన ఈ శిబిరంలో నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం ప్రాంతంలో రక్తదానంతో తమ సేవానిరతి చాటుతున్నా ముస్లీం యూత్ సోసైటి స్పూర్తి చాలా గొప్పదని తెలిపారు. సోసైటి అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ మా సంస్థపిలుపుతో స్పందించి కదలి వచ్చిన యువతకు అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడిన వారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాధిత్య, డాక్టర్ శ్రీనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



# అల్లినగరం ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 29)
కొమరోలు మండలంలోని అల్లినగరం శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయురాలు కొత్తపల్లి సుజాత పర్యవేక్షణలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమరోలు మండల రెండవ విద్యాశాఖ అధికారి బొర్రా వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆగస్టు 29వ తేదీ నాడు గిడుగు రామ్మూర్తి జన్మదినాన్ని తెలుగు భాష దినోత్సవం గా జరుపుకోవడం గిడుగు రామ్మూర్తి గారి గొప్పతనం అని తెలిపారు. తదుపరి మరొక ముఖ్య అతిథి, పాఠశాల పూర్వ విద్యార్థి, తెలుగు పండితులు ,కవి అయిన మునగనూరి రామకృష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాష పితామహుడే గాక రచయితగా చరిత్రకారుడుగా సంఘసంస్కర్తగా వాడుక భాష ఉద్యమ కర్తగా పేరు పొందారని తెలిపారు. అనంతరం తెలుగు భాషా దినోత్సవం గురించి కొన్ని పద్యాలు పాడి విద్యార్థులను రంజింప జేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కొత్తపల్లి సుజాత మాట్లాడుతూ 19 13లో బ్రిటిష్ ప్రభుత్వం చే రావు బహదూర్ బిరుదు పొందిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. తదుపరి మునగనూరి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, శివరాం, చంద్రమోహన్, గురువయ్య, బాలాజీ, రసూల్ బి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.







## గృహప్రవేశ కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 29)
మండలంలోని బడుగులేరు పంచాయతీలో పాపనబోయిన నాగేశ్వరావు, ఎంపీటీసీ కోటమ్మ ల గృహప్రవేశం వేడుకలో వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీ నాయకులు బత్తుల మాలి, గోబ్బిళ్ల శ్రీను, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

## ఎక్సలెన్సీ అవార్డు గ్రహీతలకు బహుమతి ప్రధానోత్సవం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 29)
మైనంపాడు డైట్ కళాశాలలో గురువారం ప్రకాశం జిల్లా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డ్స్ గ్రహీతలకు బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి, చీమకుర్తి ఎంఈఓ డివిఎల్ నరసింహారావు, డిసిఈబి సెక్రెటరీ శ్రీనివాసరావు, డైట్ లెక్చరర్ ఆర్ శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ కే వనజ, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బ్రహ్మయ్య, పాకల హెచ్ఎం ప్రసాద్, ఓబుల్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. అవార్డులను ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైనంపాడు సంతనూతలపాడు మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొనకొండ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరుగుమల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గురువాజీపేట కనిగిరి మండలం, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పాకల సింగరాయకొండ మండలం ఉపాధ్యాయులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జి సుబ్బారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎం వెంకటేశ్వర్లు, డైట్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## భీమవరం జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ నందు ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 29)
మండల పరిధిలోని భీమవరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో గురువారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవం మరియు క్రీడా దినోత్సవ వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రధానోధ్యాయులు బండి సుబ్బారావు అధ్యక్షతన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, హాకీ క్రీడా కారుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా క్రీడా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మేడం జి హేమలత మేడం తెలుగు భాష పై విధ్యార్థులకు పోటీలు నిర్వహించారు. పిఈటి సుబ్బరావు విధ్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం బండి సుబ్బారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృభాష పట్ల, క్రీడల పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీధర్, మస్తాన్ వలి, చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు హేమలత, పీఈటి సుబ్బారావులు విధ్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# దైనందిన కార్యక్రమంలో క్రీడలు భాగం కావాలి

## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

















(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 29)
ప్రతి ఒక్కరూ రోజువారీ కార్యక్రమాలలో క్రీడలకు కూడా స్థానం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానం కూడా అలవడుతుందని చెప్పారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో నిర్వహించిన క్రీడలలో విజేతలకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ పాఠ్యాంశాలతోపాటు క్రీడలకు కూడా సమప్రాధాన్యం ఇచ్చి రాణించాలని ఆమె సూచించారు. ఈ దిశగా వారికి అవసరమైన ప్రోత్సాహం జిల్లా యంత్రాంగం ఇస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కరరెడ్డి, నవోదయ ప్రిన్సిపాల్ వి.గీతాలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, స్టెప్ పి.ఈ.ఓ. లోకేశ్వరరావు, మేనేజర్ శ్రీమన్నారాయణ, వివిధ క్రీడా విభాగాల శిక్షకులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి




(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 29)
మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో రాబోవు వినాయక చవితి పండుగ సందర్భంగా ఎవరైనా వారి వారి గ్రామాల్లో వినాయకుడు విగ్రహాలు పెట్టడానికి మరియు నిమజ్జనంకు పోలీసు వారి నుంచి ముందస్తుగా ఇప్పటి నుండే తగు పర్మిషన్లు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి సీఐ, హనుమంతునిపాడు ఎస్ఐ ప్రజలకు తెలియజేశారు. కావున విగ్రహాలు ఏర్పాటు చేసే వారందరూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పండుగను ఘనంగా జరుపుకోవాలని పోలీసులు కోరారు.

## ప్రజల ఆరోగ్యాలతో అధికారుల చెలగాటం



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 29)
పేరుకే సచివాలయం పక్కనే మురికినీరు ఇదేమిటని ప్రశ్నిస్తున్న పజలకు సచివాలయ సిబ్బంది మాకు సంభందం లేదని సమాధానం. కంభం సినిమాహాలు సెంటరులో ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రదేశంలో సచివాలయం 2 పక్కనే ఉన్న మురికి నీటిని శుభ్రం చేసే వాళ్లే లేరు సచివాలయం సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఇది మాకు సంభందంలేదు ఆర్%డ%బి వాళ్లకు అడగండి వాళ్ళు అక్కడ రోడ్డు గుంతగా వేయడం వలన మురికి నీరు చేరుతుందని సమాధానం చెబుతున్నారని వర్షం పడితే ఆ ప్రాంత పూర్తిగా వర్షపు నీటితో నిండిపోతుందని అసలే దోమల వలన విశజ్వరాలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.సంభంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఇక్కడ మురికి నీరు నిల్వ లేకుండా ఉండే విధంగా సంభంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఈ నెల 31వ తేదీన పింఛన్లు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 29)
ఉలవపాడు మండల పెన్షన్ లబ్ధిదారులకు సెప్టంబర్ 1వ తేదీన ఇవ్వవలసిన పింఛన్లను ఈనెల 31వ తేదీన ఇవ్వనున్నట్లు ఎం పిడిఓ ఎన్ విజయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఏకో టూరిజం ఆఫ్ ఇండియా పార్కును సందర్శించిన ఎమ్మెల్యే ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 29)
మండల కేంద్రంలో హాజీపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఎకో టూరిజం ఆఫ్ ఇండియా చేపట్టిన పార్క్ ను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఫారెస్ట్ ఆఫీసర్ కె రామిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తులసిరావు, బీట్ ఆఫీసర్ నర్ససింహం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## కాటూరి సేవలు చిరస్మరణీయం కందుల విగ్నేష్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 29)
మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి సేవలు చిరస్మరణీయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి అన్నారు. స్వర్గీయ కాటూరి నారాయణస్వామి 14వ వర్థంతి సందర్భంగా కాటూరివారిపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ హంగూ, ఆర్భాటాలు లేకుండా విలువలతో కూడిన రాజకీయాలు చేసిన కాటూరి నారాయణస్వామి ని ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, కాటూరి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఛాయ్ అడ్డా టీస్టాల్‌ను ప్రారంభించిన కందుల విగ్నేష్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 29)
పట్టణంలోని ఒంగోలు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఛాయ్ అడ్డాను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి గురువారం రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారరంగంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన ఛాయ్ అందించి అందరి మన్ననలు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, కాటూరి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరుగా కాటూరి వర్థంతి వేడుకల్లో టీడీపీ నేతలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 29)
పొదిలి పట్టణంలో టీడీపీ నేతలు వేర్వేరుగా మాజీ మంత్రి, స్వర్గీయ కాటూరి నారాయణస్వామి వారి 14వ వర్థంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక పెద్ద బస్టాండ్‌లో కొందరు, చిన్న బస్టాండ్ సెంటర్‌లో కొందరు, కాటూరివారిపాలెంలో మరి కొందరు నాయకులు కార్యక్రమంలో పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల వద్ద నాయకులు మాట్లాడుతూ కాటూరి నారాయణస్వామి రాజకీయాలను ఆదర్శంగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో ముందుకు సాగాలని కోరారు. అనంతరం పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటూరి నారాయణప్రతాప్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లికార్జున, యాసీన్, తానికొండ వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, ఎన్ సులేమాన్, షేక్ బుడ్డు జిలాని, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని, ఆర్యవైశ్య సంఘం నాయకులు సామి రాజా, మేడా సుబ్బా, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com